సప్లైచైన్‌తో పరిశోధనల్లో మరింత వేగం

అస్పైర్- బయోనెస్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజగోపాల్

సిటీబ్యూరో, మే10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని అస్పైర్-బయోనెస్ట్‌లో థర్మో ఫిషర్ సైంటిఫిక్ అనే సంస్థ ప్రత్యేకమైన సప్లై చైన్ సెంటర్‌ను ప్రారంభించింది. అస్పైర్-బయోనెస్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజగోపాల్, థర్మో ఫిషర్ సైంటిఫిక్ డైరెక్టర్ జాక్వలిన్ ఎన్‌జీ కలిసి శనివారం దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..'జీవ సాంకేతిక రంగంలో పరిశోధనను వేగవంతం చేయడానికి రూపొందించిన మొదటి ప్రదేశమిది. ఈ సెంటర్‌ను బయో-ఇంక్యుబేషన్ పరికల్పనలో భాగంగా స్థాపించడం విశేషం. దేశవ్యాప్తంగా ఎంపికైన నాలుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో అస్పైర్- బయోనెస్ట్ ఒకటి. ఈ కలయిక ద్వారా పరిశోధన, అభివృద్ధి మరింత సమర్థవంతంగా కొనసాగనుంది. సప్లై సెంటర్ ద్వారా అవసరమైన రసాయనాలు, ల్యాబ్ కాన్సుమబుల్స్ తదితర సామగ్రి అదేరోజు లేదా తదుపరి పని రోజులో అందుబాటులోకి వస్తాయని' వివరించారు. దీని ద్వారా స్టార్టప్‌లు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, టీఐఎఫ్ఆర్, ఎన్ఐఏబీ, ఐఐఎల్ లాంటి పక్కనున్న పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు నేరుగా ప్రయోజనం పొందనున్నారు. ఈ భాగస్వామ్యం గ్లోబల్ పరిశ్రమలు, భారతీయ పరిశోధనా కేంద్రాల మధ్య సాంకేతిక సహకారానికి ఒక నిదర్శనంగా నిలువనుంది. నూతన ఆవిష్కరణలకు మౌలిక వసతులనుఅందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది.

బ్యాట్ బహూకరణ

మెహదీపట్నం మే 10: నాంపల్లి నియోజకవర్గంలోని మాసబ్ ట్యాంక్‌లో ఉన్న స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్‌ను ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ ఆండ్రు కొలెస్టర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాయిబాబా బ్యాట్‌ను బహూకరించారు.

సిబిల్ బాగుంటేనే రుణాలా!

- రాజీవ్ యువ వికాసం పథకానికి సర్కార్ కొర్రీలు
- సిబిల్ స్కోర్ ఆధారంగానే రుణాల మంజూరు ఉంటుందని ప్రచారం
- నిరుద్యోగుల్లో ఆందోళన



మేడ్చల్, మే10 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగులు స్వయం ఉపాధి కోసం ఎన్నో ఆశలు పెట్టుకుని రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకుంటే.. సిబిల్ స్కోర్ ఆధారంగానే రాయితీ రుణాలు అందజేస్తామనే ప్రచారంతో దరఖాస్తుదారుల గుండెలు గుబేల్ మంటున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో భాగంగా దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైన నేపథ్యంలో రాజీవ్ యువ వికాసం పథకం పోందాలంటే సిబిల్ సోర్క్ తప్పనిసరిగా ఉండాల్సిందే అని ప్రభుత్వం నుంచి లీకులు వెలువడుతుండటంపై సర్వత్రా ఆందోళన నెలకొని ఉంది. జిల్లా వ్యాప్తంగా రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి 66,648 దరఖాస్తులు వచ్చాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల వారీగా వచ్చిన దరఖాస్తులను విభజించిన అనంతరం దరఖాస్తుల పరిశీలనకు మండల, పట్టణ, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కమిటీలో మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, కార్పొరేషన్‌కు చెందిన అధికారితో పాటు బ్యాంక్ ఉద్యోగి సభ్యులుగా ఉన్నారు.

దరఖాస్తుల పరిశీలన ఇలా..

రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు వర్తింపజేయాలంటే ప్రధానంగా సిబిల్ స్కోర్‌ను చూడనున్నారు. గత 5 సంవత్సరాలుగా కార్పొరేషన్ల నుంచి ఏమైనా రుణాలు తీసుకున్నారా, ఆ కుటుంబలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా, దరఖాస్తుదారుడి సిబిల్ స్కోర్ ఎంత ఉంది తదితర విషయాలను దరఖాస్తుల పరిశీలనలో తేల్చనున్నారు. అంతకుముందు ప్రభుత్వం నుంచి రాయితీ రుణాలు పొందితే దరఖాస్తులను తిరస్కరించే అవకాశం ఉంది. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల నుంచి బీసీ, ఈబీసీ 37,935, ఎస్సీ 16,300, ఎస్టీ 2,196, మైనార్టీలు, క్రిస్టియన్లు 10,217 వారీగా దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రారంభించిన ఈ పథకానికి సిబిల్ వంటి కొర్రీలు లేకుండా లోన్లు అందించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

శంభీపూర్ రాజుకు కేటీఆర్ పరామర్శ

దుండిగల్ మే10: ఇటీవల కాలుకు గాయమవడంతో చికిత్స పొందుతూ దుండిగల్ మున్సిపాలిటీ పరిధి హిందూపూర్‌లోని తన ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును శనివారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మాతృమూర్తులను సత్కరిస్తున్న ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆస్పత్రి యాజమాన్యం

కన్నబిడ్డలకు కిడ్నీలు దానం

మాతృమూర్తులకు ఘన సత్కారం

ఖైరతాబాద్, మే 10: కిడ్నీ ఫెయిల్యూర్ అయిన తమ కొడుకులు, కుమార్తెలకు మూత్రపిండాలను దానం చేసిన మాతృమూర్తులను ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ యాజమాన్యం సత్కరించింది. మాతృదినోత్సవం సందర్భంగా ఎర్రమంజిల్‌లోని ఆస్పత్రిలో శనివారం 'అమ్మ ఇచ్చిన రెండో జీవితం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ నెఫ్రాలజీ కన్సల్టెంట్ డాక్టర్ ఎం.వెంకటేశ్వ రావు, డాక్టర్ పీఎస్ వలీ మాట్లాడుతూ.. తమ పిల్లలకు నిస్వార్థంగా తమ సొంత కిడ్నీలు దానం చేసి వారి ప్రాణాలను రెండోసారి నిలబెట్టిన మాతృమూర్తులను గౌరవించుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సుజీత్ రెడ్డి, డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ అనూష, కిడ్నీ దాతలు, గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి నూతన రైల్వే స్టేషన్

స్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

నేరేడ్‌మెట్, మే 10: చర్లపల్లి మౌలాలి బొల్లారం బైపాస్ లైన్ దయానంద్ నగర్ స్టేషన్ ప్రాంతంలో నిర్మించిన కొత్త రైల్వే స్టేషన్ త్వరలో అందుబాటులోకి రానుందని రైల్వే కమిటీ సభ్యులు నూర్, భరద్వాజ్ తెలిపారు. శనివారం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేశ్ విష్ణోయ్‌తో పాటు ఇంజనీరింగ్, విద్యుత్, సిగ్నల్ టెలికం ట్రాక్షన్ ఆపరేషన్, వాణిజ్య విభాగాల అధికారులు సంబంధిత రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. ఈ స్టేషన్ అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్ స్టేషన్‌లో రద్దీ తగ్గడమే కాకుండా ఇంజిన్ మార్పు లేకుండా ఒక గంట సమయం కలిసి వస్తుందని తెలిపారు. కొత్తగా కట్టిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని 2వ ప్లాట్‌ఫాం వరకు పొడిగించాలని రైల్వే కమిటీ సభ్యులు కోరారు. ఈ మార్గంలో వెళ్లే రైళ్లు అదిలాబాద్, తిరుపతి కృష్ణ ఎక్స్‌ప్రెస్ , నాందేడ్, నాగవల్లి, నాగర్‌సోల్, సాయినగర్, షిర్డీ, నల్లగొండ మీదుగా నాగరిసోల్, నాందేడ్ వరకు ప్రయాణిస్తాయని తెలిపారు.

ఉద్యోగుల్లో అధికమవుతున్న గుండెజబ్బులు

ఆరోగ్యంపై హెచ్ఆర్ అధికారులు చొరవ తీసుకోవాలి

స్టార్ హెచ్ఆర్ సమ్మేళనంలో అతిథులు

స్టార్ హెచ్ఆర్ సమ్మేళనంలో పాల్గొన్న అతిథులు

సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): యువ ఉద్యోగుల్లో గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ సమస్యను ఎదుర్కొనడంలో భాగంగా హైదరాబాద్‌లోని స్టార్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో స్టార్ హెచ్ఆర్ సమ్మేళనం – 2025 నిర్వహించారు. 120కు పైగా ప్రముఖ సంస్థల హెచ్ఆర్‌లు, ఆరోగ్య పర్యవేక్షకులు, కార్యాలయ నిర్వహణాధికారులు హాజరై, ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణపై చర్చించారు. నిత్యం ఆరోగ్య తనిఖీలు, మానసిక ఒత్తిడి తగ్గించే కార్యక్రమాలు, ఆరోగ్యవంతమైన ఆహారం, విరామాలు వంటి అంశాలను సంస్థ సంస్కృతిలో భాగం చేయడం అవసరమని పలు సంస్థలు సూచిస్తూ తమ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణకు తీసుకుంటున్న ముందస్తు చర్యల గురించి వివరించారు. శారీరక చలనం లేకపోవడం, అసమయ భోజనాలు, అధిక ఒత్తిడి వంటి కారణాలతో.. రక్తపోటు, మధుమేహం, అధిక బరువు, నిద్రలేమి వంటి సమస్యలు యువతను వేధిస్తున్నాయని వైద్య నిపుణులు హెచ్చరించారు. స్టార్ ఆస్పత్రుల పరిశోధనల ప్రకారం 25 నుంచి 40 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న ఉద్యోగుల్లో గుండెపోటు రేటు ఆందోళనకరంగా ఉందని నిపుణులు పేర్కొన్నారు. పౌష్టికాహార లోపం, ఒత్తిడి, నిదానంగా జరిగే వైద్య తనిఖీలే ఇందుకు ప్రధాన కారణాలని చెప్పారు. గాలి నాణ్యత, కాంతి, కూర్చునే విధానాలు ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని కార్యాలయ నిర్వహణ నిపుణులు వివరించారు. అనారోగ్య ప్రమాద అంచనాలు, హృదయ ఆపాతం సమయంలో తొందరగా స్పందించే విధానాలు, ప్రాథమిక సహాయ శిక్షణ వంటి అంశాలలో మానవ వనరుల విభాగం కీలకపాత్ర పోషించాలి అని నిపుణులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీటీ డేటా హెచ్ఆర్ తిరుమలారెడ్డి, స్టార్ ఆస్పత్రుల తాత్కాలిక విభాగం హెచ్ఆర్ డాక్టర్ రాహుల్ కట్టా, ఇన్‌వెస్కో హెచ్ఆర్ ప్రత్యూష శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్

చిక్కడపల్లి, మే 10: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేసి, మావోయిస్టులతో శాంతి చర్చలను కొనసాగించాలని పలువురు వక్తలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీ హక్కుల పూర్ణ సంఘీభావం వేదిక ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలో నిర్వహించిన సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, టీపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం తదితరులు హాజరై మాట్లాడారు. 'శాంతి చర్చలు మావోయిస్టుల కోసం కాదు అని ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం' అని పేర్కొన్నారు. మావోయిస్టుల పేరుతో దేశవ్యాప్తంగా సాగుతున్న ఎన్‌కౌంటర్ల హత్యాకాండ పతాక స్థాయికి చేరిందన్నారు.ఎన్‌కౌంటర్ పేరుతో ఆర్టికల్ 21 (జీవించే హక్కు)ను కూడా కాలరాస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండున్నర దశాబ్దాలలో ఎన్‌కౌంటర్ పేరుతో 16వేలకు పైగా మావోలు, సామన్య పౌరులను ప్రభుత్వాలు కాల్చి చంపాయని వారు ఆరోపించారు. ఈ సమావేశంలో సంజీవరావు, సత్య, లక్ష్మణ్, పేటీఎం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమౌళి, వామన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మిస్‌వరల్డ్

- తెలంగాణ కళారుపాలను ప్రదర్శించిన కళాకారులు
- సీఎం ఉపన్యాసం లేకుండానే ముగిసిన ఉత్సవం
- ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చిన ప్రాంగణం
- ఏర్పాట్లు సరిగా చేయలేదంటూ వీక్షకుల ఆగ్రహం



మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్న ఇండోర్ స్టేడియంలో ప్రేక్షకులు లేక వెలవెలబోతున్న కుర్చీలు

సిటీ బ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): ప్రపంచ అందాల పోటీలు-2025 ప్రారంభోత్సవ కార్యక్రమం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం సాదాసీదాగా జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పోటీలు ప్రారంభమయ్యాయి. విభిన్న కళారుపాల ప్రదర్శనతో 72వ అందాల పోటీలు షురూ అయ్యాయి. ఈ పోటీల్లో పాల్గొనే 110 దేశాలకు చెందిన కంటెస్టెంట్స్ తమ దేశ వేషాధరణతో పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ దేశీయ ఆహార్యంతోపాటు ఆయా దేశాల సంస్కృతి, సాంప్రదాయాలతో అలరించారు. ర్యాంప్ వాక్ చేసి సందడి చేశారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఏషియా దేశాల సుందరీమణులు నృత్యాలతో ఆకట్టుకున్నారు.తెలంగాణ రాష్ట్ర గేయం జయజయహే తెలంగాణ ఆలాపనతో ప్రారంభమైన కార్యక్రమం ఆద్యాంతం తెలంగాణ కళారూపాలతోనే సాగింది. 250 మంది కళాకారులతో కన్నుల పండువగా పేరిణి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. డప్పు, ఒగ్గు డోలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న నందిని గుప్తా..

మిస్ ఇండియా నందిని గుప్తా వచ్చినపుడు కరతాళ ధ్వనులతో స్టేడియం మార్మోగింది. భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా అందరికి నమస్కరిస్తూ సాగిన ఆమె వాక్ ఆకట్టుకుంది. అనంతరం చీర కట్టుతో ర్యాంపు పైకి వచ్చిన మిస్ నేపాలి అందరినీ ఆకర్షించింది. కంటెస్టెంట్స్‌లో అందరికంటే చివరగా ర్యాంప్ పైకి వచ్చిన మిస్ వియత్నాం తనదైన డాన్స్‌తో అందరినీ అబ్బురపరిచింది. తమ జాతీయ జెండాలతో వేదికపైకి వచ్చిన కంటిస్టెంట్స్ ఉద్వేగానికి లోనయ్యారు. చివరగా మూడు రంగుల జెండాతో మిస్ ఇండియా నందిని గుప్తా వారికి సారథ్యం వహించిన ప్రక్రియ వీక్షకులను అబ్బురపరిచింది. జై భారత్ నినాదాలు మార్మోగాయి. ఈ ప్రారంభ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మిస్ వరల్డ్ సీఈఓ జూలియ మోర్లే, మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కో, తెలంగాణ సీఎస్ రామక్రృష్ణారావు, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలతో దర్శనం..!

ప్రపంచ వ్యాప్తంగా జరిపే వేడుకకు అధికారులు ఏర్పాట్లు తగిన విధంగా చేయలేదు. ప్రారంభోత్సవం ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. ఓ వైపు అధికారులు అందరికీ వీక్షించే అవకాశం కల్పిస్తామని చెప్పినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో ఇండోర్ స్టేడియం ఖాళీ కుర్చీలతో వెలవెలబోయింది. ఎంతో గొప్పగా నిర్వహిస్తామని చెప్పిన సర్కార్ కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదని వీక్షకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గెస్ట్‌లంతా మౌనమే..!

మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి ఉపన్యసించాల్సి ఉన్నా.. మాట్లాడకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రపంచ ఈవెంట్ జరుగుతున్నప్పుడు కనీసం కంటెస్టెంట్స్‌కు శుభాకాంక్షలైనా చెప్పాల్సి ఉందని చర్చించుకుంటున్నారు. కేవలం పోటీలు ప్రారంభం అని చెప్పి ముగించారు. అనంతరం మాట్లాడాల్సిన మిస్ వరల్డ్ సీఈఓ జులియా సైతం మౌనంగానే ఉండిపోయారు. మంత్రి జూపల్లి కూడా మాట్లాడలేదు. దీంతో ప్రారంభోత్సవం సప్పగా సాగిందని వీక్షకులు చర్చించుకుంటున్నారు. అనంతరం కంటెస్టెంట్స్ అందరూ మిస్ వరల్డ్ గీతాలాపన చేయడంతో ప్రారంభోత్సవం ముగిసింది. కాగా మిస్ వరల్డ్ ఫైనల్ పోటీలు ఈనెల 31న హైటెక్స్‌లో జరగనున్నాయి.

ఆందోళన వద్దు... అప్రమత్తతే ముద్దు

- అరుంధతినగర్‌లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ మాక్‌డ్రిల్
- యుద్ధ విన్యాసాలు, రక్షణ చర్యలను కళ్లకు కట్టిన జవాన్లు

ప్రమాదం సంభవించిన వెంటనే పౌరులను స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న జవాన్లు

జవహర్‌నగర్, మే 10: 'ఆందోళన వద్దు అప్రమత్తతే ముద్దు' అని.. సంక్షోభ సమయంలో పౌరులు ఎలా ప్రవర్తిస్తే ప్రమాదాన్ని అరికట్టువచ్చని కమాండర్ విజయ్‌కుమార్ వర్మ ప్రజలకు వివరించారు. భారత్- పాక్ మధ్య ఉద్రిక్తలు తీవ్ర స్థాయికి చేరడంతో కేంద్ర హోంశాఖ సూచనల మేరకు.. 'ఒకవేళ యుద్ధం వస్తే పౌరులు తమ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలి' అనే అంశంపై శనివారం నగరంలోని జవహర్‌నగర్ అరుంధతి నగర్‌లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో పౌరులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ వర్మ మాట్లాడుతూ.. శత్రు యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లు దూసుకొస్తున్న వేళ ప్రజలు సన్నద్ధంతో ఎలా తప్పించుకోవాలో విన్యాసాలతో తెలిపారు. ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలించే ప్లాన్ల పనితీరు, సైరన్ మోగగానే ప్రతి ఒక్కరూ లైట్లు ఆర్పేసి.. ఇంట్లో సురక్షిత స్థానాల్లో దాక్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అరుంధతినగర్ యువకులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

చికిత్సతోనే లూపస్‌కు చెక్

- కిమ్స్‌లో అంతర్జాతీయ లూపస్ డే
- ఆ వ్యాధిగ్రస్తుల ర్యాంప్ వాక్

లూపస్ వ్యాధిగ్రస్తులతో కిమ్స్ వైద్యులు

సిటీబ్యూరో, మే10 (నమస్తే తెలంగాణ) : దేశంలో చాలామందిని ప్రభావితం చేస్తున్న సిస్టమెటిక్ లూపస్ ఎరిథమటోసస్ (ఎస్.ఎల్.ఈ) వ్యాధి విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని కిమ్స్ వైద్య నిపుణులు సూచించారు. సరైన సమయానికి చికిత్స తీసుకుంటే దీని లక్షణాలన్నింటి నుంచి ఉపశమనం లభిస్తుందని, నిర్లక్ష్యం చేసినా, వైద్యుల వద్దకు వెళ్లడానికి ఆలస్యం చేసినా ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంటుందని తెలిపారు. అంతర్జాతీయ లూపస్ డే సందర్భంగా శనివారం కిమ్స్ ఆస్పత్రిలో లూపస్ వ్యాధితో పోరాడుతున్న వారితో వినూత్నంగా ర్యాంప్ వాక్ నిర్వహించారు. సుమారు 40 మంది యోధులు ర్యాంప్ వాక్ చేసి, తమ ఆత్మవిశ్వాసాన్ని, వ్యాధిని జయించగలమన్న నమ్మకాన్ని ప్రదర్శించారు. ఆసియాలో ర్యాంప్ వాక్ నిర్వహించడం ఇది నాలుగోసారి. లూపస్ ఉందని చెప్పుకోవడానికే ఒకప్పుడు చాలా ఇబ్బంది పడేవారు. దాన్నుంచి, ఇప్పుడు మహిళలు నేరుగా ఆస్పత్రికి వచ్చి.. ఇక్కడ ర్యాంపుపై మోడళ్లలా ర్యాంప్ వాక్ చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీ భాస్కర్ రావు, అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా (ఏ.పీ.ఐ.) ప్రెసిడెంట్ డాక్టర్ జి.నర్సింహులు, గౌరవ అతిథులుగా ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ డి.రాజ్‌కిరణ్, రుమటాలజీ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ ఐ.రాజేంద్ర వరప్రసాద్ పాల్గొన్నారు.

గుర్తించడం ఎలా..?

విపరీతమైన నీరసం, అలసట, జ్వరం, బరువు తగ్గడం, శరీరంపై దద్దుర్లు, ఎండలో వెళ్లినప్పుడు ముఖంపై ఎర్రగా దద్దుర్లు రావడం, జుట్టు రాలడం, ఆర్థరైటిస్, మూత్రంలో ప్రొటీన్ పోవడం, మూత్రంలో రక్తం పడటం, త్వరగా మర్చిపోవడం, రక్తహీనత, తెల్ల రక్తకణాలు లేదా ప్లేట్‌లెట్లు తగ్గడం, తరచు గర్భస్రావాలు కావడం, లేదా తరచు నోట్లో పుళ్లు రావడం లక్షణాలుంటే లూపస్ అంటారు. ఇలాంటి లక్షణాలు కనిపించిన తొలిదశలోనే రుమటాలజిస్టును సంప్రదిస్తే దీన్ని పూర్తిగా నయం చేయగలం. ఆధునిక వైద్యవిధానాల్లో లూపస్ రోగులకు అత్యుత్తమ చికిత్స అందుబాటులో ఉంటోంది. మన దేశంలో 20వేల మంది వరకు రుమటాలజిస్టులు అవసరం ఉండగా, కేవలం 800 మంది మాత్రమే అందుబాటులో ఉండటం గమనార్హం.

మహిళల్లోనే ఎక్కువగా సోకుతోంది

మన దేశంలో లూపస్ తీవ్రత ఎక్కువగానే ఉన్నా, ఎంతమందికి వస్తోందన్న అధికారిక లెక్కలు లేవు. మా వద్దకు రోజూ సుమారు 80-90 మందిలో 20-25 మంది లూపస్ వ్యాధితో పోరాడేవారే ఉంటున్నారు. ప్రాంతాల వారీగా ఇది వేర్వేరుగా ఉంటోంది. పాశ్చాత్య దేశాల్లో ప్రతి లక్ష మందిలో 20-150 మందికి ఇది ఉంటోంది. ఈ వ్యాధితో పోరాడుతున్న వారిలో 90% మంది మహిళలే ఉండటం మరో బాధాకరమైన విషయం. సాధారణంగా 15-45 ఏళ్ల మధ్య వయసు (పునరుత్పత్తి దశ)లోనే ఇది వస్తుంది. వ్యాధి లక్షణాలు కన్పించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ శరత్ చంద్ర మౌళి, రుమటాలజీ విభాగం క్లినికల్ డైరెక్టర్, కిమ్స్

మానసిక రుగ్మతలను నివారించాలి

మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

ఖైరతాబాద్, మే 10: సమాజంలో విపరీత ధోరణుల నివారణకు సైకాలజిస్టులు పాటుపడాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి సూచించారు. సోమాజిగూడలోని హోటల్ కత్రియాలో జరిగిన తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం మహిళలపై ఆకృత్యాలు, హత్యలు పెరిగిపోయాయని, అలాగే ఆత్మహత్యల సంఖ్య కూడా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సైకాలజిస్టులు మనుషుల్లో మానసిక పరివర్తన తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే మానసిక ధోరణులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ మాట్లాడుతూ.. మానసిక వైకల్యం కలిగిన వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సైకాలజిస్టులపై ఉందన్నారు. యువతలో పెరుగుతున్న ఒత్తిళ్ల కారణంగానే అనేక రుగ్మతలు వస్తున్నాయని, వాటిని నివారించేందుకు సైకాలజిస్టులు కృషి చేయాలన్నారు. ఉచిత అవగాహన క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ త్రిపురణ వెంకట రత్నం, సైక్రియాటిస్ట్ డాక్టర్ హరిణి, డాక్టర్ శిల్ప, శ్రీపూజ, సుధాకర్, రాజు ఆచార్య, బీ నారాయణ రావు, పున్నంచందర్, అర్చన, అలియాపర్వీన్, కృష్ణ సాహితి, రోజా, సునయన, విశాల తదితరులు పాల్గొన్నారు.

జింకమాంసం కలిగిన ముగ్గురి అరెస్ట్

సిటీబ్యూరో, మే 10(నమస్తే తెలంగాణ): జింకమాంసం కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను అటవీశాఖ అధికారులతో కలిసి వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రకు చెందిన రిజ్వాన్ నుంచి కొనుగోలు చేసిన జింకమాంసాన్ని తన మిత్రులకు పంచుకున్న నిజామాబాద్‌కు చెందిన హమీద్ బిన్ హఖానితో పాటు టోలీచౌకికి చెందిన హసన్ బక్రన్, వీరి దగ్గర మాంసం తీసుకున్న మెహదీపట్నంకు చెందిన రహ్మాన్‌ను అరెస్ట్ చేసినట్లు వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. వారినుంచి 3 కిలోల జింకమాంసంను స్వాధీనం చేసుకుని వారితో పాటు మాంసాన్ని హైదరాబాద్ వెస్ట్ రేంజ్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేర్కొన్నారు.